సాక్షి
నిర్మల్
మంగళవారం । 29 । ఆగస్టు । 2023



క్రీడా కుసుమాలు

జిల్లాలో క్రీడలపై ఆసక్తి పెరుగుతోంది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణిస్తున్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కథనం. 8లో▶



సొంత భవనం లేక కష్టాలు

తానూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం, వసతులు లేకపోవడంతో విద్యార్థులు గోసపడుతున్నారు. 9లో▶

గరిష్టం/కనిష్టం
32.4 /23.6

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉక్కపోత పెరుగుతుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కుష్ఠు సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర లెప్రసీ మానిటరింగ్ అధికారిని డాక్టర్ సుధ



సర్వేను పర్యవేక్షిస్తున్న మానిటరింగ్ అధికారి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో చేపడుతున్న కుష్ఠు సర్వే పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర లెప్రసీ మానిటరింగ్ అధికారిని డాక్టర్ సుధ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాగులవాడ, మంజులాపూర్, ముజిగి పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న సర్వేను సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 30 వరకు లెప్రసీ సర్వే కొనసాగుతుందన్నారు. పూర్తిస్థాయిలో సర్వే చేసిన తర్వాత మచ్చలు ఉన్నవారికి పరీక్షలు చేసి కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తిస్తారన్నారు. కుష్ఠు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు ఇస్తున్న ఉద్యోగులు

నిర్మల్ రూరల్: జిల్లా విద్యా శాఖలో భాగమైన సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు తమను క్రమబద్ధీకరించాలనీ, అప్పటి వరకు మినిమం టైం స్కేలు ఇవ్వాలని ఆందోళన బాట చేపట్టారు. సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో కస్తూరిబా విద్యాలయ సిబ్బంది, ఎంఆర్‌సీలలో పని చేస్తున్న క్లస్టర్ సీఆర్పీలు, మండల ఎంఐఎస్, సీసీవో మెసెంజర్లు సామూహిక సెలవు పెట్టి కలెక్టర్, విద్యాశాఖ అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. 15 ఏళ్లుగా విద్యాశాఖకు సేవలు అందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం లేదని తెలిపారు. ఇప్పటికైనా రెగ్యులర్ చేయాలని కోరారు. నోటీస్ ఇచ్చినవారిలో జేఏసీ నాయకులు భూసారపు గంగాధర్, భోజన్న, గజేందర్, రత్నం, మహేందర్, ఫిరోజ్, అపర్ణ, విమల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు అమ్మి సెకండ్ ఏఎన్‌ఎంల నిరసన



కూరగాయలు అమ్ముతున్న ఏఎన్‌ఎంలు

నిర్మల్‌చైన్‌గేట్: తమను రెగ్యులర్ చేయాలని ప్రధాన ఏజెండాతోపాటు పలు డిమాండ్లను పరిష్కరించాలని చేపడుతున్న రెండో ఏఎన్‌ఎంల నిరవధిక దీక్ష సోమవారం 22వ రోజుకు చేరుకుంది. సమ్మె చేపట్టిన నాటి నుంచి ఏఎన్‌ఎంలు వివిధ పద్ధతుల్లో నిరసనను తెలుపుతున్నారు. సోమవారం కూరగాయల మార్కెట్లో తోపుడు బండిపై కూరగాయలు అమ్మి నిరసన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ వచ్చాక కాంట్రాక్ట్ పద్ధతిని తొలగించి ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారం చేపట్టాక హామీని మరిచిపోయారన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్లు, మెప్మా, వీఆర్ఏ, ఆర్టీసీ తదితర శాఖలోని సిబ్బందిని రెగ్యులర్ చేసిన ముఖ్యమంత్రి రెండో ఏఎన్‌ఎంలపై వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

‘కచ్చితంగా పోటీలో ఉంటా’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా పోటీలో ఉంటానని ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్ స్పష్టం చేశారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం మాట్లాడారు. తనకు పార్టీ టికెట్ ఇవ్వకపోయినా ప్రజలు మాత్రం దూరం కాలేదన్నారు. ఇక్కడి ప్రజలతో 12 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. తనకు బీఆర్‌ఎస్‌లో కంటే.. ప్రజల్లోనే గుర్తింపు ఉందని తెలిపారు. అందుకే రెండుసార్లు గెలిపించారన్నారు. ఎమ్మెల్యే పదవీకాలం ఇంకా మూడు నెలలు ఉందని, పూర్తిస్థాయి పదవీకాలం బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఆ తర్వాత ఏ పార్టీ తరఫున పోటీ చేసేది చెబుతానన్నారు. తనకు అన్యాయం చేసినవారికి ప్రజలే బుద్ధిచెపుతారన్నారు. తనను కాదన్న బీఆర్‌ఎస్ పార్టీలోకి మాత్రం మళ్లీ వెళ్లనని తెలిపారు. ప్రజా సేవకోసమే రాజకీయాల్లోకి వచ్చానని, ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవ చేస్తానని వెల్లడించారు.

అమ్మో.. ఎట్ల భరించాలె!

- ముందస్తు టిక్కెట్ల ప్రకటనతో అభ్యర్థులపై ఆర్థిక భారం
- తడిసి మోపెడవుతున్న ఖర్చులు
- మూడు నెలలు ఎలా అని ఆందోళన
- ఇదీ ఎమ్మెల్యే అభ్యర్థుల పరిస్థితి



నిర్మల్: అసెంబ్లీ ఎన్నికలకు మూడునెలల ముందే అభ్యర్థులను ప్రకటించడం బాగానే ఉంది. కానీ.. ఈ మూణ్నెళ్లపాటు సదరు అభ్యర్థులు ఎదుర్కొనే ఇబ్బంది అంతాఇంతా కాదు. క్యాడర్‌ను కాపాడుకోవడానికి, కార్యక్రమాలను నిర్వహించడానికి, ప్రత్యర్థులను నిలువరించడానికి ఇలా నిత్యం పెట్టే ఖర్చు తడిసి మోపెడవుతోంది. రోజువారీ ఖర్చులతోపాటు ప్రచారం, పార్టీల్లో చేరికలు, ముఖ్యనాయకుల రాకపోకలు, సభలు, సమావేశాలు, పరామర్శలు, పలకరింపులు, శుభకార్యాలు ఇలా.. ఏంచేసినా, ఎక్కడికి వెళ్లినా డబ్బులతోనే పని. జిల్లాలో ఇప్పటికే కారు పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించగా, కమలం, హస్తంలోనూ కొంతమంది ఆశావహుల పేర్లు దాదాపు ఖరారైనట్లే. దీంతో సదరు ప్రజాప్రతినిధులు, నేతలు బయటకు సంతోషంగా ఉన్నా.. లోపల మాత్రం తొందరగా ప్రకటించినందుకు ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తోంది.

సంతోషమే కానీ..

జిల్లాలో నిర్మల్ అభ్యర్థిగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ నుంచి విఠల్‌రెడ్డి, ఖానాపూర్ జాన్సన్‌నాయక్‌కు బీఆర్‌ఎస్ టికెట్లు కేటాయించింది. దీంతో పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి. అభ్యర్థులు కూడా హర్షం వ్యక్తంచేశారు. ఇక బీజేపీ విషయానికొస్తే ముథోల్, ఖానాపూర్‌లో పోటాపోటీ ఉన్నా నిర్మల్‌లో మాత్రం ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి టికెట్ ఖాయం. కాంగ్రెస్‌లోనూ నిర్మల్ నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పేరొక్కటే ఇప్పటివరకు ఖాయంగా తెలుస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఎన్నికలకు ఇంకా మూడు నెలల సమయం ఉంది. ఎప్పుడైతే పార్టీ అభ్యర్థులుగా ఖరారయ్యారో వారికి అప్పటి నుంచే ఎన్నికల సన్నాహక ఖర్చు కూడా మొదలైంది.

పండుగలు.. పబ్బాలు..

ముందు ముందు ప్రధాన పండుగలు ఉన్నాయి. వినాయక చవితి, బతుకమ్మ, దసరా దీపావళి పండుగలు రాబోతున్నాయి. ఈ పండుగలకు ఎవరినీ నొప్పించకుండా చూసుకోవాలి. ఊరూరా వేడుకలకు ఖర్చు చేయాలి. మూడునెలల తర్వాత ఎన్నికలు కదా.. ఇప్పటి నుంచే ఖర్చు పెట్టడం దండగా.. అని కూడా అనొచ్చు. కానీ.. ఇప్పుడున్న రాజకీయాలు అలా లేవు. ఎవరు ఎక్కువ ఖర్చు పెడితే వారిదే పైచేయి అన్న తరహాలో రాజకీయం తయారైంది. రూ.కోట్లు గుమ్మరిస్తే కానీ.. ఓట్లు రాలవని నేతలే బహిరంగంగా కామెంట్లు చేస్తున్నారు. చిన్నదో.. పెద్దదో.. ఎంతోకొంత మొత్తం చేతుల్లో పెడితేనే కార్యకర్తలు కూడా అన్నీ వదులుకుని అభ్యర్థి వెంటవస్తారు. ఈ మూడునెలలు జాగ్రత్తగా కాపాడుకోకపోతే.. ఎదుటి పార్టీవాళ్లు తమ నాయకులు, కార్యకర్తలను వాళ్లవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తుంటారు. ఏ చిన్న అవకాశం ఎదుటి పక్షానికి ఇవ్వొద్దంటే చాలా జాగ్రత్తగా ఉండాలి. విందులు, వినోదాలు, గిఫ్టులు సిద్ధం చేయాల్సిందే. అందుకే అభ్యర్థులుగా ఖరారైన వాళ్లు ఇప్పటి నుంచే ఖర్చు చేయాల్సివస్తోంది.

అన్నింటికీ పైసలే..

ఎన్నికలంటేనే పైసలతో కూడుకున్న ముచ్చట. పైసా లేనిది ఏ పనీ కాదు. కార్యకర్త రాకున్నా, నాయకుడు అలిగినా.. కాసింత ఖర్చు చేయాల్సిందే. లేదంటే.. సొంతపార్టీలోనే వేరుకుంపట్లు పెట్టేస్తుంటారు. తమ నేతల మీదే దుష్ప్రచారం చేస్తారు. అందుకే అభ్యర్థులు ఇలాంటి వారిపైనా ఓ కన్నేసి ఉంచుతారు. వీరిని బుజ్జగించడానికీ డబ్బులే కావాలి. ఎన్నికల సమయంలో అభ్యర్థులు ప్రచారం కోసం భారీ ఖర్చు చేయాల్సి వస్తుంది. ఊరూరా తిరిగే వాహనాలు, గోడరాతలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, జెండాలే కాకుండా మీడియాలో ప్రకటనలు, సోషల్‌మీడియాలో పోస్టులు ఇలా ప్రతీదానికీ పైసలు కావాల్సిందే. ప్రత్యర్థి పార్టీలో ప్రధానంగా ఉన్న నేతలను తమ వైపు రప్పించాలన్నా.. సొంత పార్టీలోని కీలక నేతలను కాపాడుకోవాలనుకున్నా.. మనీతోనే పనవుతుంది. ఎవరైనా పార్టీ ముఖ్యనాయకుడు, పెద్దనేతలు వస్తే పెట్టే కార్యక్రమాలకూ ఖర్చు చేయాల్సిందే. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ భారీ బహిరంగ సభలు, పెట్టాలి. ఇందుకు పెద్దమొత్తంలోనే అవుతుంది. ఇవన్నీ కాకుండా ఎన్నికలకు ముందు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు చేసే ఖర్చులకు లెక్క ఉండదు.

విన్నపాలూ.. వినవలె..

చేతికి డబ్బులివ్వగానే పనైపోదు. తమకు కాసిన్ని ఓట్లు పడాలంటే ముందుగా సంబంధిత ఓటర్ల విన్నపాలనూ వినిపించుకోవాల్సి ఉంటుంది. కులాలు, సంఘాలవారీగా ఇప్పటికే చాలామంది అభ్యర్థుల ఇళ్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఎన్నికల ముందు విన్నవిస్తేనే పనిచేస్తారన్న నమ్మకంతో వెళ్తున్నారు. ఏ నియోజకవర్గంలో చూసినా అధికారపార్టీ మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల ముందర బారులు తీరి ఉంటున్నారు. తమ సంఘానికి లేదంటే కులానికి భవనం కావాలంటున్నారు. కనీసం స్థలమైనా ఇప్పించాలని విన్నవిస్తున్నారు. ఇలాంటి వాటినీ సదరు అభ్యర్థులు తీర్చాల్సి ఉంటుంది. ఓవైపు ఆర్థికవ్యయంతోపాటు మరోవైపు ఇలాంటి వినతుల పరిష్కారానికీ కృషి చేయాల్సి ఉంటుంది. వచ్చిన వారికి భోజనం కూడా పెట్టి పంపిస్తున్నారు. అన్ని చేసినా చివరకు తమకే ఓటేస్తారన్న గ్యారంటీ ఎవరూ ఇవ్వరు. అందుకే.. మూణ్నెళ్ల ముందు అభ్యర్థిత్వం ప్రకటించారన్న సంతోషం కంటే, ఈ మూడు నెలలు ఎలా భరించాలిరా బాబూ.. అన్న ఆందోళన నేతల్లో కనిపిస్తోంది.

సంక్షేమ లక్ష్యాలను చేరుకోవాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు సకాలంలో అందించి లబ్ధిచేకూరేలా ప్రత్యేక చొరవ చూపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. ఆసరా పెన్షన్లు, తెలంగాణకు హరితహారం, బీసీలు, మైనార్టీలకు ఆర్థికసాయం, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, గొర్రెల పంపిణీ, గృహలక్ష్మి, కారుణ్య నియామకాలపై సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ 15లోగా హరిత లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. దశాబ్ది సంపద వనాల లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఆసరా పెన్షన్ దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా పరిశీలించి అర్హుల జాబితాను ఆమోదం కోసం పంపించాలన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. బీసీ కుల వృత్తుల వారికి, మైనారిటీలకు లక్ష రూపాయలు ఆర్థికసాయం లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలన్నారు. గృహలక్ష్మి దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తిచేసి అర్హుల జాబితాను అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులతో మాట్లాడుతూ తెలంగాణకు హరితహారంలో ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.

డీఎఫ్‌వో బదిలీ

నిర్మల్‌టౌన్: జిల్లా అటవీశాఖ అధికారి సునీల్ హిరామత్ హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్క్‌కు బదిలీ అయ్యారు. హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీలో పనిచేసిన కె.రాంకిషన్‌ను నిర్మల్ డీఎఫ్‌వోగా ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

కాలేజీలకు అరకొర నిధులు



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల

- ఒక్కో విద్యార్థికి రూ.71 చొప్పున కేటాయింపు
- సరిపోవంటున్న ప్రిన్సిపాళ్లు
- గతేడాది నిధులు కూడా పెండింగ్..
- ప్రశ్నార్థకంగా కళాశాలల నిర్వహణ

నిర్మల్ రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల రోజువారీ ఖర్చులకోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రతీ విద్యార్థికి సగటున రూ.71 చొప్పున ఖర్చవుతాయని అంచనా వేసి రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలకు నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఉన్నత విద్యకు వారధిగా ఉండే ఇంటర్ కళాశాలలో సమస్యలు పేరుకు పోతున్నాయి. నిధులు లేకపోవడంతో ఏటా ప్రవేశాలు ప్రశ్నార్థకమవుతున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఏమాత్రం సరిపోవని అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు పేర్కొంటున్నారు. గతంలో కళాశాలలో చదివే విద్యార్థుల నుంచి రూ. 500 చొప్పున ప్రవేశ రుసుము వసూలు చేసేవారు. ఈ రుసుమును కళాశాలల ఖర్చుల నిర్వహణ కోసం వాడేవారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత విద్యార్థులకు ఉచిత నిర్బంధ విద్య అమలు చేస్తుండడంతో 2014 నుంచి విద్యార్థుల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయడం లేదు. ఇటు ప్రభుత్వం సరిపడా నిధులు విడుదల చేయకపోవడం, అటు విద్యార్థుల నుంచి రుసుము వసూలు చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టంగా మారుతోంది.

ఒక్కో విద్యార్థికి రూ.71..

కళాశాలల నిర్వహణ కోసం ఒక్కో విద్యార్థికి డే టు డే బడ్జెట్ కింద రూ .71 విడుదల చేశారు. ఈ నిధులు కేవలం కంటి తుడుపు చర్యలా భావిస్తున్నారు. జిల్లాలో 12 జూనియర్ కళాశాలలు ఉండగా.. అందులో 5,391 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 2,641 మంది ప్రథమ సంవత్సరం, 2,750 మంది ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈ కళాశాలలకు రూ.3,00,543 నిధులు మంజూరయ్యాయి. రోజురోజుకూ ఖర్చులు పెరుగుతున్నాయని, విద్యార్థులకు ఇచ్చే మొత్తాన్ని కనీసం రూ.500 కు పెంచాలని అధ్యాపకులు కోరుతున్నారు. రాష్ట్రంలో మొత్తం 406 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా 1,38,450 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుతున్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు..

జిల్లాలోని 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా 10 జూనియర్ కళాశాలలకు మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాలకు రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఇటీవల నిధులను మంజూరు చేసింది. జిల్లాలోని ముధోల్, భైంసా, ఖానాపూర్, మామడ, లోకేశ్వర, దిలావర్‌పూర్, కడెం, సారంగాపూర్, కుభీర్, జిల్లా నిర్మల్ బాలికల జూనియర్ కళాశాలల్లో మరుగుదొడ్లు నిర్మించనున్నారు. ప్రతీ నిర్మాణానికి రూ.4.6 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరశురాం తెలిపారు.

వివరాలు...

జిల్లాలో మొత్తం కళాశాలలు 12
విద్యార్థుల సంఖ్య 5,391
నిర్వహణకు మంజూరైన నిధులు రూ.3,00,543
మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరైన నిధులు : రూ.92 లక్షలు

ట్రెజరీకి పంపించాం



జిల్లాలోని కళాశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఆయా కళాశాలల వారీగా నిధుల విడుదల కోసం ఇప్పటికే బిల్లులను ట్రెజరీకి పంపించాం. సరైన సమయంలో నిధులు వస్తాయనుకుంటున్నాం. గత సంవత్సరం సగం కళాశాలలకు నిధులు రాలేదు.

– పరశురాం, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

కాలేజీల నిర్వహణ ఎలా..

కళాశాల నిర్వహణ అంటే అటెండెన్స్ రిజిస్టర్లు, చాక్ పీసులు, డస్టర్లు, విద్యుత్ బిల్లు, ఫోన్ బిల్లు, మంచినీళ్ల స్వీపర్ వేతనం, పరిసరాల పరిశుభ్రత, బోరు మరమ్మతులు, టాయిలెట్స్ శుభ్రపరచడం, జాతీయ పర్వదిన వేడుకల ఖర్చు, తదితర వాటితోపాటు కనిపించని ఎన్నో ఖర్చులు ఉంటాయి. వీటన్నింటికీ కలిపి ప్రతీనెల కనీసం రూ.6 నుంచి రూ.9 వేల వరకు ఖర్చవుతాయని అధ్యాపకులు పేర్కొంటున్నారు. ప్రవేశాలు ఏడాదికి ఏడాది తగ్గిపోతుండడంతో ఉచిత ప్రవేశాలను బోర్డు ప్రకటించింది. రెండేళ్లుగా డే టుడే బడ్జెట్ పేరుతో విద్యార్థులకు రూ.100 లోపు విడుదల చేస్తున్నారు. ఇవి ఎక్కువ విద్యార్థులు ఉన్న కళాశాలలు సర్దుకో వచ్చిమో కానీ.. తక్కువ సంఖ్యలో ప్రవేశాలు ఉండే కళాశాలలకు ఇబ్బందిగా మారుతుంది. ఇంటర్ విద్యకు నిధుల కేటాయింపు సరిగా లేకపోవడంతో ఖర్చు సమస్యగా మారింది. చాలామంది ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- అధికారులను ఆదేశించిన కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణితో కలిసి సోమవారం ప్రజావాణి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి వచ్చి సమస్యలపై ఫిర్యాదు చేస్తే త్వరగా పరిష్కారం అవుతుందనే నమ్మకంతో ప్రజలు ఇక్కడికి వచ్చి ఇస్తారన్నారు. వాటిని సంబంధిత జిల్లా అధికారులు సత్వరమే స్పందించి పరిష్కారం చేయాలని ఆదేశించారు. పరిష్కరించలేని అంశాలు ఉంటే ఫిర్యాదుదారులకు అక్కడే అవగాహన కల్పించాలన్నారు. సమస్యను బట్టి పైఅధికారులకు పంపించాల్సి ఉంటే ఫిర్యాదులను పంపిస్తూ, ఆ కాపీని ఫిర్యాదుదారులకు కూడా పంపించాలన్నారు. ఒక సమస్యపై ఫిర్యాదుదారుడు పలుమార్లు వచ్చే పరిస్థితి ఉండకూడదని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 27 ఫిర్యాదులు అందాయని, వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇతరులను ఓటరుగా చేర్చొద్దు

నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని మహాలక్ష్మివాడ, నాగనాయిపేట్ శివారులో ఉన్న ఓటర్లను అనంతపేట్ గ్రామ ఓటర్ల జాబితాలో నమోదు నిలిపివేయాలని కోరుతూ నిర్మల్‌రూరల్ మండలం గ్రామ అభివృద్ధి కమిటీ అనంతపేట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా గ్రామంలో 1,200 ఓటర్లు 2 వేల జనాభా ఉందన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమ క్రమబద్ధీకరించాలి

తెలంగాణ సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కనీస వేతన స్కేలు అమలు చేయాలన్నారు. 15 ఏళ్లుగా పనిచేస్తున్నామని, విద్యాశాఖలో కీలకంగా ఉంటూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికై క్రమబద్ధీకరణకు అర్హత కలిగి ఉన్నామని వివరించారు.

ట్రెయినీ ఐఏఎస్‌లకు సహకరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి



గుస్సాడీతో నృత్యం చేస్తున్న ట్రెయినీ ఐఏఎస్‌లు

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి

పెంబి: మండల కేంద్రానికి వచ్చిన ట్రెయినీ ఐఏఎస్‌లకు గ్రామస్తులు సహకరించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రానికి సోమవారం వచ్చిన కలెక్టర్, ట్రెయినీ ఐఏఎస్‌లు, ఎల్‌బీఎస్ఎన్ఏఏ డైరెక్టర్ కాటికితల శ్రీనివాస్‌కు గ్రామస్తులు గుస్సాడీ నృత్యాలతో, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది మంగళ హారతులతో స్వాగతం పలికారు. గుస్సాడీలతో ట్రెయినీ ఐఏఎస్‌లు సరదాగా నృత్యం చేశారు. అనంతరం పెంబి మండల పంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గ్రామాలలో ట్రెయినీ ఐఏఎస్‌లు పర్యటిస్తారని, సమస్యలను వారికి వివరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగారెడ్డి, సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీవో రత్నాకర్‌రావు, పలు శాఖ అధికారులు, పంచాయతీరాజ్, ఐకేపీ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అధ్యయనం చేయాలి

దస్తురాబాద్: గ్రామీణ ప్రజల సమస్యలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడంతోపాటు పరిశోధన చేయాలని లాల్‌బహదూర్ శాస్త్రి అకాడమీ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ ట్రెయినీ ఐఏఎస్‌లకు సూచించారు. మండలంలోని గోడిసిర్యాల గోండుగూడ గ్రామానికి వచ్చిన ట్రెయినీ ఐఏఎస్‌లకు ఆదివాసీలు గుస్సాడీ నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యంగా ఆదివాసీ గూడేలలో ప్రజల వెనుకబాటుకు కారణాలు, వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై పరి శోధనలు చేసి నివేదిక అందించాలన్నారు. ట్రెయినీ ఐఏఎస్‌లకు ప్రజలు సహకరించాలని, వివరాలు తె లుపాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ మాన్కూ, డీఎల్‌పీవో రమేశ్, ఎంపీడీవోలు బి.మల్లేశ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీవోలు అనిల్, ఉపేందర్, తహసీల్దార్ జాకిర్, ఏపీఎం గంగన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అవమానించాలనే ప్రచారం

- దాడి ఘటనపై స్థానిక నేతలు స్పందించలేదు
- భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు

భైంసాటౌన్: ఇటీవల హైదరాబాద్‌లో స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తనపై దాడిచేసిన వీడియోను తనను అవమానించేందుకు సొంత పార్టీ నేతలే ప్రచారం చేశారని భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు ఆరోపించారు. గిరిజన సంఘాలు, తన మద్దతుదారులతో సోమవారం బాసర నుంచి భైంసాకు ర్యాలీగా చేరుకున్నారు. ఏఎంసీ కార్యాలయంలో మాట్లాడారు. జరిగిన ఘటనపై ఇప్పటికే మంత్రి తలసాని తనకు ఫోన్ చేసి క్షమాపణ చెప్పారని, గిరిజన సమాజానికి సైతం క్షమాపణలు చెప్పారని వెల్లడించారు. దీనిని ఇక్కడితో వదిలేయాలని తనకు మద్దతుగా నిలిచినవారిని కోరారు. తనకు జరిగిన అవమానంపై జిల్లా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఎమ్మెల్సీ దండే విఠల్, టీఎస్ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి స్పందించి మంత్రి తలసానితో మాట్లాడి వివాదం సద్దుమణిగేలా చేశారని తెలిపారు. ముథోల్‌కు చెందిన కొందరు నాయకులు ఉద్దేశపూర్వకంగానే తనపై దాడి దృశ్యాలను సోషల్ మీడియాలో వైరల్ చేశారని ఆరోపించారు. ఇలాంటి వారికి త్వరలో తగిన గుణపాఠం చెబుతానన్నారు.

క్రీడా కుసుమాలు

• జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ • సత్తాచాటుతున్న క్రీడా పాఠశాల విద్యార్థులు

భారత హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ప్రతీఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించుకుంటారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఆటలపై ఆసక్తి పెంచుకోవడంతో రోజురోజుకు క్రీడలపై ఆదరణ పెరుగుతోంది, ఈ నేపథ్యంలో క్రీడాకారులు జూడో, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, మార్షల్ ఆర్ట్స్‌లో తదితర క్రీడల్లో రాణిస్తున్నారు. శిక్షకులు అందిస్తున్న మెలకువలతోపాటు కఠోర సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయస్థాయిలో సత్తాచాటుతున్నారు. పతకాలు సాధిస్తూ ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు. – ఆదిలాబాద్/నిర్మల్‌ఖిల్లా



పరుగు పెడితే పతకమే



పదో తరగతి విద్యార్థిని ఎం.మనీషా పరుగు పెడితే పతకం ఖాయం అన్నట్లుగా మెడల్స్ సాధిస్తోంది. ఇప్పటివరకు దాదాపు ప్రాతినిధ్యం వహించిన ప్రతి ఈవెంట్లో పతకం సాధించింది. నిజామాబాద్‌లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ పోటీల్లో మూడు పతకాలు, రిలే ఈవెంట్లో గోల్డ్, 600, 200 మీటర్ల ఈవెంట్లలో రజత పతకాలతో సత్తా చాటింది. గోల్కొండలో సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అండర్–14లో 2000 మీటర్ల ఈవెంట్లో గోల్డ్ మెడల్ సాధించింది.

రాష్ట్రస్థాయిలో రాణిస్తా



పదో తరగతి చదువుతున్న రేవంత్, ఆకాశ్, లక్ష్మణ్ గతేడాది కామారెడ్డిలో జరిగిన ఓపెన్ బ్యాడ్మింటన్ స్టేట్ మీట్ అండర్–15లో సింగల్, డబుల్స్ ఈవెంట్లకు ప్రాతినిధ్యం వహించాడు. జిల్లాలోని ఖోడాద్‌కు చెందిన క్రీడా పాఠశాల పూర్వ విద్యార్థి అఖిల్ ప్రస్తుతం ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. కామారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించడమే కాక హైదరాబాద్‌లో జరిగిన సీఎం కప్ పోటీల్లో మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో పోటీపడ్డాడు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తానని చెబుతున్నాడు.

ఐపీఎస్ అవుతా..



9వ తరగతి విద్యార్థిని ఎస్.ఆనంది అథ్లెటిక్స్ పోటీల్లో పథకాలు సాధించింది. ఇప్పటివరకు ఐదు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్య వహించగా మూడు పోటీల్లో పతకాలను గెలుచుకుంది. 2022లో హైదరాబాద్ గచ్చిబౌలిలో రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అండర్–14 పోటీల్లో 600 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. ఇటు ఆటల్లో సత్తా చాటుతూనే చదువులోనూ రాణించి ఐపీఎస్ సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తోంది.

పోటీల్లో మెరిసింది



8వ తరగతిలోనే సహస్ర..జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. కరీంనగర్ జిల్లాకు చెందిన కుమార్–పద్మల కుమార్తె సహస్ర సౌత్‌జోన్ పోటీల్లో పతకం సాధించింది. భోపాల్‌లో నిర్వహించిన రెండవ ఖేలో ఇండియా జాతీయ మహిళల లీగ్ ర్యాంకింగ్ జూడో టోర్నీలో 44 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. కరీంనగర్‌లో 7వ రాష్ట్ర సబ్ జూనియర్ క్రైడిట్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో 44 కేజీల విభాగంలో కాంస్య పతకంతో మెరిసింది.

జాతీయస్థాయిలో రాణిస్తా



పదో తరగతి విద్యార్థిని లిప్సిక 2022, అక్టోబర్‌లో ఢిల్లీలో జరిగిన ఆలిండియా ఉమెన్స్ జూడో నేషనల్ లీగ్ ర్యాంకింగ్ టోర్నమెంట్ 52 కేజీల విభాగంలో ప్రాతినిధ్యం వహించింది. కేరళలోని త్రిస్సూర్‌లో ఖేలో ఇండియా సౌత్ జోన్ సబ్ జూనియర్ జూడో లీగ్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం సాధించింది. కరీంనగర్‌లో జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో 57 కేజీల విభాగంలో రజత పతకం గెలుచుకుంది. నిరంతరం సాధన చేస్తూ జాతీయస్థాయిలో రాణిస్తా.

సౌత్ జోన్ పోటీల్లో సత్తా



9వ తరగతి విద్యార్థిని అలేఖ్య జాతీయ, సౌత్ జోన్ స్థాయి పోటీల్లో సత్తా చాటింది. భోపాల్‌లో సెకండ్ ఖేలో ఇండియా నేషనల్ ఉమెన్స్ లీగ్ ర్యాంకింగ్ జూడో టోర్నమెంట్లో 57 కేజీల విభాగానికి ప్రాతినిధ్యం వ హించింది. కేరళ త్రిస్సూర్‌లో రెండో ఖేలో ఇండియా ఉమెన్స్ జూడో నేషనల్ లీగ్ ర్యాంకింగ్ టోర్నమెంట్ 55 కేజీల విభాగంలో రజతం గెలుచుకుంది. కరీంనగర్‌లో రాష్ట్ర సబ్‌జూనియర్ కేడెట్ జూడోచాంపియన్‌షిప్ పోటీల్లో 57 కేజీల విభాగంలో ప్రాతినిధ్యం వహించింది.

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ



నిర్మల్‌లోని బుధవార్‌పేట్‌కు చెందిన లావణ్య–అమర్‌కుమార్‌ల కుమార్తె ఏ. శ్రీవల్లి బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా ప్రతిభ కనబర్చింది. ఇప్పటికే అండర్–13,–15లో సత్తాచాటింది. అండర్–17 బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్ 10వ ర్యాంక్‌తో దూసుకెళ్తోంది. బ్యాడ్మింటన్‌లో 2028 ఒలంపిక్స్‌లో పతకాన్ని సాధించడమే లక్ష్యమంటోంది.

ఒలింపిక్స్‌లో ఆడుతా..



పదో తరగతి విద్యార్థి అఖిల్ చెన్నైలో జాతీయ సబ్ జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో 60 కేజీల విభాగంలో ప్రాతినిధ్యం వహించాడు. కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో 60 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఒలింపిక్స్‌లో ఆడి పతకం సాధించడమే తన లక్ష్యం.

వరల్డ్ చాంపియన్‌షిప్ లక్ష్యం



ఆదిలాబాద్‌లోని క్రీడా పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జుడోకా తరుణ్. రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించాడు. చెన్నైలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన జాతీయ సబ్ జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో 50 కేజీల విభాగంలో పోటీపడ్డాడు. కరీంనగర్‌లో జరిగిన 7వ రాష్ట్ర సబ్ జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో 50 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈసారి జరిగే రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో చాంపియన్‌షిప్ సాధించడమే తన లక్ష్యం.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ



9వ తరగతి విద్యార్థిని ఐశ్వర్య. రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తోంది. గతేడాది డిసెంబర్ కామారెడ్డిలో జరిగిన ఓపెన్ బ్యాడ్మింటన్ స్టేట్ మీట్ అండర్–13 లో డబుల్స్ ఈవెంట్‌లో రజత పతకం సాధించింది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన 9వ రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ మీట్లో సింగల్, డబుల్ ఈవెంట్లలో పోటీపడింది.

పతకమే లక్ష్యం



పదో తరగతి విద్యార్థులు సాయి స్పందన, పూజిత. గతేడాది డిసెంబర్ కామారెడ్డిలో ఓపెన్ బ్యాడ్మింటన్ స్టేట్ మీట్ అండర్–15 విభాగంలో ప్రాతినిధ్యం వహించారు. హైదరాబాదులో ఇటీవల ఆగస్టులో నిర్వహించిన 9వ రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో సింగల్స్, డబుల్స్ ఈవెంట్లలో ప్రాతినిధ్యం వహించారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకం సాధించడమే వారి లక్ష్యం.

మార్షల్ ఆర్ట్స్'లో సత్తా



ఇచ్చోడ: మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యూష తన ప్రతభతో జాతీయ స్థాయిలో రాణించి ప్రశంసలు అందుకుంది. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఈమె ఇచ్చోడలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతోంది. గోవా, జమ్మూకశ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో సత్తాచాటింది.

బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ



ఇచ్చోడ: గిరిజన విద్యార్థి సుధీర్ బేస్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయిలో రాణించి ప్రతిభచాటాడు. నిర్మల్ జిల్లాలోని పరిమండల్‌కు చెందిన ఈయన..ఐదో తరగతి నుంచి ఇచ్చోడలోని గిరిజన గురుకుల, కళాశాల్లో చదువుతున్నాడు. రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. గతేడాది కేరళలోని కోలాం జిల్లాలో జరిగిన జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు.

క్రీడల్లో సత్తా



లక్ష్మణచాంద మండలం బాబాపూర్‌కు చెందిన ఎస్.స్థితప్రజ్ఞరెడ్డి..ట్రైనర్ వికాస్ హర్ష శిక్షణలో క్రీడల్లో రాటుదేలాడు. ప్రస్తుతం బ్యాడ్మింటన్ ప్రపంచ జూనియర్ ర్యాంకింగ్స్ 38వ స్థానంలో కొనసాగుతున్నాడు. బల్గేరియన్ జూనియర్ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం సాధించాడు. స్పానిష్ ఇంటర్నేషనల్ ప్రపంచ పోటీలు స్పెయిన్‌లో జరగగా ఈ పోటీల్లో సత్తాచాటి సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు.

అమ్మనాన్నల ప్రోత్సాహంతోనే..



దిలావర్‌పూర్‌కు చెందిన గాడి రవళిక. తల్లిదండ్రులు లక్ష్మి–గోపాల్. పాఠశాల స్థాయి నుంచి రవళిక ఖోఖో అంటే ఇష్టం. జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటింది. అమ్మానాన్నలు, పీఈటీ భోజన్న సార్, తోటి సహచర మిత్రులు, సీనియర్ల ప్రోత్సాహంతో ముందుకెళ్తుంది.

జాతీయస్థాయిలో నాలుగు సార్లు..



భైంసాటౌన్: పట్టణంలోని ఉషూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన రాథోడ్ స్వాతి ఉషు క్రీడలో జాతీయస్థాయిలో రాణిస్తోంది. ఇప్పటికే నాలుగు సార్లు జాతీయ స్థాయిలో పాల్గొని మెడల్స్ సాధించింది. ఇటీవలే పోస్టల్ శాఖలో స్పోర్ట్స్ కోటాలో జీడీఎస్‌గా ఉద్యోగం పొందింది. ఓవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు పోటీల్లో పాల్గొంటోంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్‌గా ఎదగడమే తన లక్ష్యమని చెబుతోంది.

ధ్యాన్‌చంద్ స్ఫూర్తిగా..



హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ స్ఫూర్తిగా తీసుకొని క్రీడాకారులు ఎదగాలి. నచ్చిన క్రీడలో మెలకువలు సాధిస్తూ, నైపుణ్యానికి మరింత పదును పెట్టాలి. సరైన శిక్షణ పొందితే ప్రతిభ ప్రదర్శించడం కష్టమేమి కాదు.

– కుమ్మరి భోజన్న, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి

లైంగికదాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: లైంగికదాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలు శిక్షతోపాటు, రూ.5 వేల జరిమానా విధిస్తూ నిర్మల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియనాయక్ కథనం ప్రకారం.. నిర్మల్‌రూరల్ మండలానికి చెందిన మహిళ, ఆమె పెద్దమ్మ కుమారుడు బొదను అనిల్ 2016 ఆగస్టు 27న జిల్లాకేంద్రంలోని తిరుమల టాకీస్‌లో సినిమా చూసి బయటకు వచ్చారు. అదే సమయంలో సోన్ మండలం పాక్‌పట్లకు చెందిన నేరస్తుడు పల్లేపు సాయిలు, స్థానిక గాజులపేట్‌కు చెందిన బాధితురాలి బావ గంగన్న వారిని కలుసుకున్నారు. వీరందరూ ఓ చోట మద్యం తాగారు. ఈ క్రమంలో బాధితురాలిపై సాయిలు లైంగికదాడికి యత్నించగా ప్రతిఘటించింది. బీరుసీసాతో పొడిచే ప్రయత్నం చేశాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో పారిపోయాడు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నేరస్తుడిని అరెస్టు చేశారు. అప్పటి ఎస్సై సునీల్ కేసు దర్యాప్తు చేపట్టారు. చార్జీషీట్ దాఖలు చేసి కోర్టులో నేరస్తుడిని హాజరుపర్చారు. పీపీ వినోద్‌రావు 12 మంది సాక్షులను ప్రవేశపెట్టి, నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

వాగులో జారిపడి ఒకరి మృతి



యోగేశ్ (ఫైల్)

నార్నూర్: వాగులో జారిపడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని మాలేపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రవికిరణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాంబ్లె రాజారాం, పంచపూల దంపతులకు నలుగురు కుమారులు. వీరికి గ్రామ సమీపంలో మూడెకరాల పొలం ఉంది. వ్యవసాయం చేస్తూ కుటుంబానికి మూడో కుమారుడు యోగేశ్ (17) చేదోడువాదోడుగా ఉన్నాడు. ఆదివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో రెండు ఎద్దులు, ఒక ఆవు మేత కోసం బయటకు తీసుకెళ్లాడు. సాయంత్రం 6 గంటల సమయంలో తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో వాగులో ఆవును నీటితో కడుగుతుండగా కాలు జారి పడిపోయాడు. కొందరు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. అప్పటికే సమయం దాటడంతో రాత్రి అయింది. సోమవారం గజ ఈతగాళ్లతో మృతదేహాన్ని బయటకు వెలికితీసినట్లు ఎస్సై తెలిపారు. తండ్రి రాజారాం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

విద్యార్థులకు అస్వస్థత

తానూరు: మండలంలోని భోసి బీసీ వసతిగృహం విద్యార్థులు రాత్రి భోజనం వికటించి అస్వస్థతకు గురయ్యారు. బీసీ వసతి గృహం విద్యార్థులకు ఆదివారం రాత్రి చికెన్ వడ్డించారు. సోమవారం ఉదయం తరగతి గదిలో 7 గురికి వాంతులు విరేచనాలు చేసుకున్నారు. హెచ్‌ఎం గంగాధర్ వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అన్నం అరగక పోవడంతో వాంతులు విరేచనాలు చేసుకుని అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు.



హాస్టల్‌లో విశ్రాంతి తీసుకుంటున్న విద్యార్థులు

నిజాయతీ చాటిన ఉద్యోగి



భక్తురాలికి బంగారు గొలుసు అప్పగిస్తున్న పూజార్లు

భైంసా: బాసర ఆలయ ఉద్యోగి తన నిజాయతీ చాటుకున్నాడు. సోమవారం హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తురాలు సరస్వతీ అమ్మవారి ఆలయానికి వచ్చింది. దర్శనం తర్వాత తన మెడలో బంగారు గొలుసు పోగొట్టుకుంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న వాగ్దేవి సొసైటీ అధ్యక్షుడు నాగరాజుకు 15 గ్రాముల బంగారు గొలుసు దొరికింది. ఈ విషయాన్ని ఆలయ అధికారులకు చెప్పాడు. భక్తురాలు సైతం తాను గొలుసు పోగొట్టుకున్నట్లు అర్చకుడు మదన్‌పూజారికి తెలిపింది. ఆమె వివరాలు తెలుసుకుని బంగారు గొలుసును తిరిగి అప్పగించారు. నాగరాజు నిజాయతీని పలువురు మెచ్చుకున్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



లోకేశ్వరం: మండలంలోని హద్‌గాం గ్రామానికి చెందిన గర్భిణి 108 అంబులెన్సులో ప్రసవించింది. పూజారి హారికకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు సోమవారం 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడికి వెళ్లి ఆమెను నిర్మల్ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా అర్లి ఎక్స్‌రోడ్డు సమీపంలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. వాహనం అక్కడే నిలిపివేసి హారికకు ప్రసవం చేయగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నారని ఈఎంటీ శ్రీకాంత్, పైలెట్ సాయికిరణ్ తెలిపారు. వారిని నిర్మల్ ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రికి తరలించారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇస్తున్న నిరుద్యోగులు

ఉట్నూర్‌రూరల్: రాష్ట్రంలో ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో జీవో నెంబర్ 3ను అమలు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్థానిక గిరిజనులకు కల్పించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీఎడ్, డీఎడ్ నిరుద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట వారు నిరసన తెలిపారు. ఉపాధ్యాయ, గిరిజన సంఘాల నాయకులు ఆత్రం సుగుణ, జగన్, నేతావత్ రాందాస్, బానోత్ రామారావులు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటీడీఏలో ఖాళీగా ఉన్న 1800 బ్యాక్‌లాగ్ పోస్టులతోపాటు ఉపాధ్యాయ పోస్టులను స్పెషల్ డీఎస్సీ ద్వారా గిరిజన, ఆదివాసీ నిరుద్యోగులతో వెంటనే భర్తీ చేయాలన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా, నిరసనలో భాగంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరుద్యోగ సంఘ నాయకులు పి.దీపక్, జె.సుమేశ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ వైద్యులపై డైరెక్టర్‌కు ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: వికలాంగుల సర్టిఫికెట్ల జారీలో రిమ్స్ వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రూపేష్‌రెడ్డి అన్నారు. సోమవారం రిమ్స్ వైద్యులపై డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకల్యం ఉన్న వారికి కాకుండా డబ్బులు ఇచ్చిన వారికి వైద్యులు సర్టిఫికెట్ ఇస్తున్నారని ఆరోపించారు. బేల మండలం దహెగాంకు చెందిన బాలుడు ఎండీ అయాజొద్దీన్‌కు పుట్టుకతో వైకల్యం ఉండగా, మొదటిసారి 40 శాతానికి పైగా, ఆ తర్వాత 61 శాతం, ప్రస్తుతం 30 శాతం వైకల్యం ఉన్నట్లు వైద్యులు సర్టిఫికెట్ ఏవిధంగా జారీ చేస్తారని ప్రశ్నించారు. స్పందించిన డైరెక్టర్ విచారణ జరిపించి అర్హులైన వారికి సర్టిఫికెట్లు అందేలా చూస్తామని హామీఇచ్చారు.



బాధితుడితో కలిసి డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రూపేష్‌రెడ్డి

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన నజీర్‌అలీ ఖాన్ గంజాయి విక్రయిస్తుండగా సోమవారం పోలీసులు పట్టుకున్నారు. టూటౌన్ ఎస్సై జీవీ రమణారెడ్డికి సమాచారం అందగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతని వద్ద నుంచి 90 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ అశోక్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

10 మంది డిబార్

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ దూరవిద్య పరీక్షలో 10 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. పరీక్షలో మాల్‌ప్రాక్టీస్ చేస్తుండగా వారిని పట్టుకుని డిబార్ చేసినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. మొత్తం 262 మంది విద్యార్థులకు గాను 168 మంది పరీక్షకు హాజరవగా, 94 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని నరేందర్ పేర్కొన్నారు.